సాక్షి సంగారెడ్డి

శనివారం । 7 । జనవరి । 2023



కంప్యూటర్ వదిలి.. పొలాల్లోకి 8లో

నిత్యం కంప్యూటర్ ముందు బిజీగా ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రైతు కష్టాలు తెలుసుకునేందుకు ముందుకొచ్చారు. బృందంగా ఏర్పడి తెల్లాపూర్‌ను సందర్శించారు.



దారులన్నీ జాతర వైపే.. 8లో

దారులన్నీ మోతిమాత ఆలయం వైపు దండు కట్టాయి. భక్తులు ఇంటిల్లిపాదితో తరలివచ్చి దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు.



అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యం కల్పిస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. 9లో

నిధులిచ్చినా చేయరేం..?

జెడ్పీ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు అసహనం | తక్షణం రోడ్ల పనులు ప్రారంభించాలని ఆదేశం | కార్యదర్శుల వసూళ్లపై సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యేలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఎందుకు పనులు చేయడం లేదని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్ శాఖల ద్వారా రోడ్ల కోసం రూ. 238 కోట్లు మంజూరై నెల రోజులు గడుస్తున్నప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రోడ్ల పనులు పకడ్బందీగా చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అలాగే జిల్లాలో 134 నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు రూ. 26.60 కోట్లు మంజూరయ్యాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రానికి రావాల్సిన రూ. 40 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని మంత్రి విమర్శించారు. ఉపాధి హామీ కింద రైతులు నిర్మించుకున్న కల్లాల నిధులు రూ.150 కోట్లను కూడా కేంద్రం వెనక్కి తీసుకుందన్నారు.

> జిల్లాకు కొత్తగా పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయాన్ని మంజూరు చేశామని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ కార్యాలయం
>
> **ఎస్ఈ కార్యాలయం మంజూరు**
>
> మెదక్‌లో ఉండేదని, ఎస్ఈ కార్యాలయం మంజూరు కావడంతో టెండర్ల నిర్వహణ, సాంకేతిక అనుమతి, పనుల అగ్రిమెంట్ త్వరగా జరుగుతాయన్నారు.

ఎస్ఈ కార్యాలయం మంజూరు

జిల్లాకు కొత్తగా పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయాన్ని మంజూరు చేశామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ కార్యాలయం మెదక్‌లో ఉండేదని, ఎస్ఈ కార్యాలయం మంజూరు కావడంతో టెండర్ల నిర్వహణ, సాంకేతిక అనుమతులు, పనుల అగ్రిమెంట్ వంటి ప్రక్రియ త్వరగా జరుగుతాయన్నారు.

అందుబాటులో రోగ నిర్ధారణ పరీక్షలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగ నిర్ధారణ పరీక్షలను అందుబాటులోకి తెచ్చామని నిరుపేదలు ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులకు గురికావొద్దని పేర్కొన్నారు. సంగారెడ్డి, జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రుల్లో టిఫా స్కాన్ వంటి సేవలు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు జరుగుతున్న జిల్లాల్లో సంగారెడ్డి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

కార్యదర్శుల వసూళ్ల పంచాయితీపై ఆగ్రహం

గ్రామ పంచాయతీల్లో అక్రమ కట్టడాలతో పంచాయతీ కార్యదర్శులు పెద్ద ఎత్తున వసూళ్ల దందాకు పాల్పడుతున్నారని సభ్యులు మండిపడ్డారు. ఒక్కో గ్రామంలో 150కిపైగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని, అనుమతి తీసుకోకుండా రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే కార్యదర్శులు కనీసం నోటీసులు ఇవ్వడం లేదని విమర్శించారు. అందిన కాడికి దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి స్పందిస్తూ సంబంధిత కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయుల భూ దందాలపై..

ప్రభుత్వ ఉపాధ్యాయులు విధులకు ఎగనామం పెడుతున్నారని జెడ్పీటీసీలు సమావేశం దృష్టికి తెచ్చారు. పాఠశాలలకు వెళ్లకుండా భూదందాలు, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారాలతో కాలం వెళ్లబుచ్చుతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యే జగ్గారెడ్డి వినతి

ఇంటి స్థలాల పట్టాలిచ్చిన వారికి వెంటనే పొజిషన్ చూపాలని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలకు కోటా కేటాయించాలని కోరారు. అలాగే సీడీపీ నిధుల నుంచి దళితబంధు యూనిట్లకు కేటాయించేలా అనుమతి ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. విజ్ఞప్తులను పరిశీలిస్తామని మంత్రి పేర్కొన్నారు.



సమావేశంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు

ఎనిమిది శాఖలపై చర్చ

ఎజెండాలోని ఎనిమిది అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. వ్యవసాయం, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, ఆర్‌అండ్‌బీ, పీఆర్, వైద్యారోగ్య, విద్యా, మత్స్యశాఖలకు సంబంధించిన అంశాలపై సభ్యులు చర్చించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీలు బీబీపాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు మాణిక్ రావు, భూపాల్ రెడ్డి, క్రాంతికిరణ్, హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్, టీఎస్ఎఫ్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, రాజర్షిషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రత్యేక పథకం

అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక పథకానికి శ్రీకారం చుట్టబోతోందని మంత్రి పేర్కొన్నారు. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రస్తుతానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, కమ్యునిటీహాళ్లలోకి మార్చాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులను భర్తీ చేయాలని మంత్రి స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. ఆయా పోస్టులకు సంబంధించి ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేసి, ఖాళీలను భర్తీ చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు అందడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందని.. వీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని స్పష్టం చేశారు.

25న గీతంలో అంతర్జాతీయ చిరుధాన్యాల వేడుకలు

పటాన్‌చెరు టౌన్: ఈనెల 25వ తేదీన గీతంలో అంతర్జాతీయ చిరుధాన్యాల వేడుకలు నిర్వహిస్తున్నట్టు స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఉమామహేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చిరుధాన్యాల ఉత్పత్తి– వాటి వినియోగాలను పెంపొందించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి, కేంద్ర ప్రభుత్వం 2023ను చిరుధాన్యాల ఏడాదిగా ప్రకటించాయన్నారు. కార్యక్రమానికి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ సీవీ రత్నావతితో పాటు పలువురు శాస్త్రవేత్తలు హాజరుకానున్నారని తెలిపారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై వాల్‌పోస్టర్ పోటీ నిర్వహిస్తున్నామని.. ఉత్తమ రూపకల్పన చేసిన తొలి పది పోస్టర్లను ఎంపిక చేసి వాటిలో అత్యుత్తమమైన మూడు పోస్టర్లకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. అలాగే ఆయా అంశాలపై ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు సైతం నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి గల వారు తమ పేర్లను ఈనెల 21వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99495 00753 లేదా 95815 98698 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బ్రిడ్జి కోర్సుతో ముడి పెట్టొద్దు

కొండాపూర్(సంగారెడ్డి): బ్రిడ్జి కోర్సుతో సంబంధం లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సంగారెడ్డిలో డీఎంహెచ్ఓ గాయత్రీదేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీఎస్సీ నర్సింగ్ ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టిందని.. అందులో బ్రిడ్జి కోర్సు సర్టిఫికెట్ ఉన్న వారు మాత్రమే అర్హులని షరతు పెట్టిందన్నారు. అలాగే అప్లికేషన్‌కు రెండు రోజులు మాత్రమే సమయం ఇచ్చారని వాపోయారు. మార్కులను బట్టి ఉద్యోగాలు ఇవ్వాలని లేని పక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల మహేశ్, దిలీప్, అరుణ్‌తో పాటు అభ్యర్థులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిన్నారంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్కీం వర్కర్లతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ.. స్కీం వర్కర్ల సమస్యలు సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్లను పర్మినెంట్ చేయడంతో పాటు రూ. 26 వేల గౌరవ వేతనం అందించేలా సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌రావుతో పాటు ఆయా గ్రామాల ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకురావాలి



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకురావాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఖేడ్ డిపోలో నారాయణఖేడ్ – శబరిమలైకు సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులో సురక్షిత ప్రయాణం సాధ్యమని, ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజియన్ డిప్యూటీ మేనేజర్ దైవాదీనం, డీఎం మల్లేశయ్య, ఎంపీపీ చాందీబాయి, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, రమేశ్ చౌహాన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, పీఆర్వో పాండు, మెకానికల్ ఫోర్‌మెన్ ధనుంజయ్, అయ్యప్ప దీక్షాదారులు పాల్గొన్నారు.

జాతీయ యువ శిబిరానికి 'తారా' విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ యువ శిబిరానికి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరం ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కర్ణాటకలో నిర్వహించే అతి పెద్ద యువ ఉత్సవమని పేర్కొన్నారు. శిబిరానికి కళాశాలకు చెందిన బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థి దత్తు, బీబీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి నరేశ్ ఎంపికయ్యారని వెల్లడించారు.

కేతకిలో టెండర్ల ఆహ్వానం



ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయానికి సంబంధించి టెండర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆలయ ఈఓ శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని కేతకి ఆలయానికి తాత్కాలిక విద్యుత్ దీపాల అలంకరణ, జనరేటర్, లైటింగ్, ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, శిఖరం గోవా కట్టడం, క్యూలైన్ల ఏర్పాటు, మరుగుదొడ్ల టెండర్, పూల అలంకరణ కల్యాణ నిర్వహణ, తదితర వాటికి ఆసక్తి ఉన్నవారు కేతకి ఆలయం పేరిట డీడీ తీసి, కొటేషన్‌తో జతపరిచి ఈనెల 9వతేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు దేవాదాయ శాఖ ఆవరణలో ఏర్పాటు చేసిన డబ్బాలో వేయాలని సూచించారు.

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 14 మందికి ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అదేవిధంగా 13 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్టు పేర్కొన్నారు.

మేడిన్ సంగారెడ్డి

సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కులో 'కంటి వెలుగు' అద్దాల తయారీ



కంటి అద్దాలను చూపుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీలు, ఎమ్మెల్యేలు


ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి టౌన్: గతేడాది 'కంటి వెలుగు'కు అద్దాలు చైనా నుంచి తెప్పించామని, ఈసారి జిల్లాలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కులో తయారు చేయించామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ. 250 కోట్లతో చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కాబోతోందని అన్నారు. ఇంత భారీ సంఖ్యలో కంటి పరీక్షలు చేయడం ప్రపంచంలో ఎక్కడా జరగలేదన్నారు. ఈఏడాది 60 లక్షల కళ్లజోళ్లు తెప్పించామని తెలిపారు. వంద రోజుల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ఈనెల 18 నుంచి నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కోరారు. కంటి వెలుగు బృందంలో ఒక మెడికల్ అధికారి, అప్తమాలజిస్ట్, ఇద్దరు ఏఎన్ఎంలు, ముగ్గురు ఆశాలు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారని తెలిపారు. ఈనెల 12లోగా కౌన్సిల్, మండల పరిషత్ సమావేశాలు పూర్తిచేయాలని సూచించారు.. జిల్లాలో 69 టీమ్‌లతో పాటు మూడు టీంలను స్పేర్‌లో పెట్టామన్నారు. జూన్ నెలాఖరులోగా అందరికీ పరీక్షలు చేయాలని.. జిల్లాలోని అన్ని టీంలను మానిటరింగ్ చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధుల అనుమానాలను మంత్రి నివృత్తి చేశారు. అంతకుముందు కంటి వెలుగు జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి క్యాంపుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, మాణిక్‌రావు, చంటి క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, టీఎస్ ఎంఐసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లపై త్వరలో సమావేశం

రామచంద్రాపురం(పటాన్ చెరు): ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లపై త్వరలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ప్రచారం భాగంగా బీహెచ్ఈఎల్ జిల్లా పరిషత్, రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమోషన్లు ఇవ్వడానికి సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి






మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

ల్యాండ్ పూలింగ్‌ను వెంటనే ఆపాలి

కొండాపూర్(సంగారెడ్డి): ల్యాండ్ పూలింగ్ పేరుతో ప్రభుత్వం పేదలు, దళితుల భూములు గుంజుకుంటుందని తక్షణమే ల్యాండ్ పూలింగ్‌ను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో సీపీఎం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ పేరుతో జిల్లా వ్యాప్తంగా పటాన్‌చెరు, కంది, సంగారెడ్డి, కొండాపూర్, మునిపల్లి, జహీరాబాద్ మండలంలో పేదల, దళితుల భూములను గుంజుకొని ప్లాట్లు చేసి అమ్ముకుంటుందని విమర్శించారు. దళితులకు మూడెకరాలు ఇస్తానన్న ప్రభుత్వం నేడు దళితుల వద్ద ఉన్న అసైన్డ్ భూములు లాక్కోవడం ఏంటని ప్రశ్నించారు. ల్యాండ్ పూలింగ్ ఆపకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యాదవరెడ్డి, యాదగిరి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు .

పిల్లలను నేరస్తులుగా చూడొద్దు



అధికారులతో మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: నేరం మోపబడిన పిల్లలను నేరస్తులుగా చూడకూడదని వారి హక్కులకు భంగం కలిగించొద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని బాల రక్షక్ భవన్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు పిల్లలతో సరైన పద్ధతిలో మెలగాలని సూచించారు. ఈసందర్భంగా నేరం మోపబడిన పిల్లలతో జడ్జిలు మాట్లాడారు. కలత చెందకుండా బాగా చదువుకోని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జి శాలిని, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

స్కీంల ప్రైవేటీకరణ సరికాదు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్రం స్కీంల ప్రైవేటీకరణను ఆపడంతో పాటు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ కోరారు. ఈమేరకు శుక్రవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట స్కీం వర్కర్లతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితర 72 స్కీంలో దేశవ్యాప్తంగా కోటి మంది, రాష్ట్రంలో మూడున్నర లక్షల మంది పని చేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు కూడా అందడం లేవని వాపోయారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్కీంలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తుందన్నారు. స్కీంలను స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తుందని మండిపడ్డారు. స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లేశ్, సాయిలు, నాయకులు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మజీద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల, మతాలకతీతంగా అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హత్నూరలో షాదీఖానా భవన్ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండి అభివృద్ధి చేసుకుందామని, త్వరలో హత్నూరలో నాలుగు లైన్ల రోడ్డు పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, సర్పంచ్ వీరస్వామి గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పాషా, వార్డు సభ్యులు ఆసిఫ్, ఖదీర్, నాయకులు ఇస్మాయిల్, శ్రీధర్ గుప్తా, అజీజ్, అఫ్జల్, వాజిద్, జహీర్, మాణిక్ రెడ్డి, నవీన్ గౌడ్, రవి, మేరాజ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

9న జాబ్‌మేళా



మెదక్ కలెక్టరేట్: ఈనెల 9న మెదక్ పట్టణంలోని ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి రామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ జాబ్‌మేళా ఉంటుందన్నారు. శుభగృహ ప్రాజెక్ట్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పురుషులకు మాత్రమే వంద పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి ఆపై చదివి, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. నెలకు రూ. 12వేల వేతనంతోపాటు ఇన్సెంటీవ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 98669 76470 నంబర్ సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా అర్చక పరీక్షలు

తొలిరోజు 327 మంది హాజరు



నాచారం గుట్ట కేంద్రంలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

వర్గల్(గజ్వేల్): మండల పరిధిలోని నాచారం గుట్టలో దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహిస్తున్న అర్చక ఆగమ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 387 మంది అభ్యర్థులకు 327 మంది హాజరయ్యారు. టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 195 మంది అభ్యర్థులకు 163 మంది, దేవస్థాన మండపంలోని పరీక్ష కేంద్రంలో 192 మంది అభ్యర్థులకు 164 మంది హాజరైనట్టు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్ కట్టా సుధాకర్‌రెడ్డి చెప్పారు.

రేపు బాల్ బాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

మిరుదొడ్డి(దుబ్బాక): ఉమ్మడి మెదక్ జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియన్ అండర్–19 బాల్ బాడ్మింటన్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక చేస్తామని బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జనరల్ సెక్రెటరీ పీవీ.రమణ తెలిపారు. శుక్రవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ బీహెచ్ ఈఎల్ రామచంద్రాపురంలోని సంకల్ప్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్ ఓల్డ్ ఎంఐజీలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు క్రీడా జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలని స్పష్టం చేశారు.
2జనవరి, 2003 తర్వాత జన్మించిన వారు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు బోనోఫైడ్ లేదా, పదో తరగతి మెమో , ఆధార్ కార్డు జీరాక్స్‌లను వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడా జట్లు నెల 12 నుంచి 14 వరకు ఖమ్మం జిల్లా బోనకల్‌లో నిర్వహించే 67వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని తెలిపారు.
మరిన్ని వివరాలకు 9440703038, 9704746511 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



మోతిమాత దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దారులన్నీ మోతిమాత జాతర వైపే

- తండాల గిరిజనం ఆలయానికే
- ఇంటిల్లిపాది తరలివచ్చి మొక్కుల చెల్లింపు



జహీరాబాద్: దారులన్నీ మోతిమాత ఆలయం వైపు దండు కట్టాయి. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో నిర్వహించిన మోతిమాత జాతర ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని గిరిజనులతో పాటు జిల్లా నలుమూలలు, ఆయా జిల్లాల నుంచి భక్తులు వచ్చారు. పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు ప్రత్యేకంగా వాహనాలు కట్టుకుని ఇంటిల్లిపాదితో తరలివచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 60వేల మందికి పైగా భక్తులు వచ్చారని నిర్వాహకులు పేర్కొన్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకుగాను అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తుతోపాటు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు.

దర్శించుకున్న ప్రముఖులు

మంత్రి టి.హరీష్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, క్రాంతికిరణ్, భూపాల్ రెడ్డి, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, జిల్లా కలెక్టర్ శరత్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, టీఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ మోహన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌రావు పవార్, ఢిల్లీ వసంత్, వై.నరోత్తంలు ఆలయాన్ని సందర్శించి మోతిమాతను దర్శించుకున్నారు.

పటాన్‌చెరులోనే ఎక్కువ పట్టాలు



పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు: రాష్ట్రంలోనే అత్యధికంగా పటాన్ చెరు పేదలకు పట్టాలు ఇచ్చామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరులో 58 జీఓ కింద పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పాలనలో పేదలను పీల్చి పిప్పి చేశారని ఆరోపించారు. ప్రభుత్వ జాగాలో ఇళ్లు కట్టుకున్న పేదలకు కంటి మీద కునుకు లేని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి నుంచి పేదలకు విముక్తి కల్పించాలనే లక్ష్యంతో వారు నివసిస్తున్న ఇళ్లకు వారిని యజమానులు చేస్తూ పట్టాలు ఇచ్చామన్నారు. జిల్లాలో 830 మందికి జీఓ 58 ద్వారా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాలుష్య ప్రాంతంలో ఇంటింటికీ రక్షిత మంచి నీరు అందించిన ఘనంగా తమ పార్టీదేనన్నారు. పేదల కోసం రాష్ట్రంలోనే అత్యధికంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో 13 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, కలెక్టర్ శరత్‌కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆంగ్ల ప్రతిభ పోటీలు

హుస్నాబాద్: తెలంగాణ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ), ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ, భారతీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఆంగ్ల ప్రతిభాపాటవ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఈఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పంజా రాజమల్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతి చదివే విద్యార్థులకు మండల స్థాయిలో ఆంగ్లభాషలో స్పెల్ విజర్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీ పరీక్షలను అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు మండల స్థాయిలో ఎంఈఓలు, జిల్లా స్థాయిలో డీఈఓలు కన్వీనర్లుగా ఉంటారన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా స్థాయిలో ఈనెల 22వ తేదీన సిద్దిపేటలో, జిల్లా స్థాయి విజేతలకు ఫిబ్రవరి 13వ తేదీన రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల్లో ఆంగ్లభాషపై అభిరుచి పెంచడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి తోడ్పడుతుందన్నారు.

ఎంబీఏ సీటు ఇప్పిస్తానంటూ...

జిన్నారం(పటాన్‌చెరు): ఎంబీఏ సీటు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఘటనలో గుమ్మడిదల పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. జిన్నారం సీఐ వేణుకుమార్, ఎస్‌ఐ విజయ్‌కృష్ణలు చెప్పిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని బొంతపల్లికి చెందిన అఖిల్‌గౌడ్‌కు బెంగుళూరులోని క్రిస్ట్ యూనివర్సిటీలో ఎంబీఏ సీటు ఇప్పిస్తానని కడపకు చెందిన కిరణ్ మభ్యపెట్టాడు. ఏడాదికాలంగా ఆయా సర్టిఫికెట్ల పేర డబ్బు గుంజాడు. సీటు విషయం ఎప్పుడు అడిగినా దాటవేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, శుక్రవారం కిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పలు విద్యాసంస్థల సీట్లు ఇప్పిస్తామని ఇలాంటి వ్యక్తులు మోసం చేస్తారని, విద్యార్థులు ఎవరినీ నమ్మవద్దన్నారు.

అత్తతో గొడవపడి...

పిల్లలను తీసుకొని వెళ్లిపోయిన కోడలు



మహేశ్వరి, ఆమె కుమారుడు అఖిల్(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): అత్తతో గొడవ జరిగాక కోడలు అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధిలోని లింగారెడ్డిపేటకు చెందిన మన్నె మహేష్- మహేశ్వరి దంపతులకు రెండున్నర సంవత్సరాల కొడుకు అఖిల్, 8 నెలల కూతురు అక్షర ఉన్నారు. కాగా గురువారం సాయంత్రం నాలుగు గంటలకు మహేశ్వరికి అత్తకు గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన మహేశ్వరి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లి పోయింది. దీంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం మహేశ్వరి సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూమిని కబ్జా చేస్తున్నారని ఆత్మహత్యాయత్నం

తూప్రాన్: తమ పట్టా భూమిని రియల్ వ్యాపారులు అక్రమంగా కబ్జా చేస్తున్నారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన భీమరి శ్రీనివాస్‌కు హుస్సేన్‌పూర్ శివారులో పట్టా భూమి ఉంది. పక్కనే ఉన్న ఘనపూర్ శివారులో భూమిని కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు తమ భూమిని సర్వే పేరుతో అక్రమంగా కబ్జా చేశారని మనస్తాపం చెంది పురుగు మందు తాగాడు. దీంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్న శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సింగోజు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన సింగోజు మురళీకృష్ణ ఆచార్యులను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు దామాషా ప్రకారం 55 నుంచి 60 శాతం వరకు శాసనసభ ఎన్నికలలో సీట్లు కేటాయించాలన్నారు. వివిధ కార్పొరేషన్‌లకు చైర్మన్‌లుగా బీసీలను నియమించాలన్నారు. బీసీల అభివృద్ధే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తానన్నారు.

మందుబాబులకు జరిమానా.. జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి శుక్రవారం జరిమానా, జైలుశిక్ష విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా పది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.25వేల జరిమానా, వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ధర్మారావు కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి గుర్తుతెలియని వ్యక్తి కింద పడి మృతిచెందాడు. గమనించిన సెక్యూరిటీ గార్డు అనిల్ విషయాన్ని మేస్త్రీ తాతయ్య నాయుడుకు చెప్పాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు 30ఏళ్ల వయసు ఉంటుందని, వివరాలు తెలిసినవారు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

బంగారు గొలుసు చోరీ

నర్సాపూర్: బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా బంగారు గొలుసు చోరీ అయ్యింది. పట్టణానికి చెందిన స్వరూప-పెంటయ్య దంపతులు శుక్రవారం పటాన్‌చెరు వెళ్లేందుకు నర్సాపూర్ బస్టాండుకు వచ్చారు. బస్సు ఎక్కుతుండగా తమ బ్యాగులో ఉన్న రెండున్నర తులాల నల్లపూసలతో కూడిన బంగారు గొలుసు చోరీ అయినట్టు బస్సు ఎక్కగానే గుర్తించి వెంటనే బస్సు దిగారు. బస్టాండ్‌లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబం ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

నంగునూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఇంటి ముందు మృతదేహంతో బంధువులు ఆందోళన చేపట్టిన సంఘటన శుక్రవారం పాలమాకులలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏటి హరికృష్ణను అదే గ్రామానికి చెందిన కవ్వం అనిల్‌రెడ్డి రెండు రోజుల కిందట మోటర్ సైకిల్‌తో ఢీ కొట్టడంతో మృతి చెందాడు. హరికృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనిల్‌రెడ్డి ఇంటి ముందు మృతదేహం ఉంచి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని హరికృష్ణ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని స్థానిక నాయకులు, గ్రామపెద్దల హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నూతన విధానంలో వ్యవసాయం చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): మారుతున్న జీవన విధానానికి అనుకూలంగా వ్యవసాయం నూతన విధానంలో చేయాలని చేర్యాల ఏడీఏ రాధిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలువురు రైతులు వెదజల్లే పద్ధతిలో సాగుచేసి వరి పొలాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రాకేష్, అగ్రోస్ నిర్వాహకులు మనోహర్, రైతులు పాల్గొన్నారు.



వరిలో వెదసాగు పద్ధతిని పరిశీలిస్తున్న ఏడీఏ రాధిక

శనగలో సస్యరక్షణ ఇలా..

- పూతదశలో నీటిఎద్దడి లేకుండా చూడాలి
- తెగుళ్లు సోకితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి



మునిపల్లి(అందోల్): రబీలో శనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. పంట రక్షణకు సకాలంలో చర్యలు చేపట్టకపోతే పచ్చ పురుగులు, వేరుఎండు తెగులు పంటను సోకుతాయి. దీని వల్ల దిగుబడులు తగ్గిపోతాయి. అయితే ఈ సమయంలో శనగలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎండుతెగులు..

నేలలో ఉన్న ఈ శిలీంద్రం అన్ని దశల్లో ఆశించి పంటకు నష్టం కలిగిస్తుంది. ముఖ్యంగా కాయ దశలో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాఫర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి.

శనగ పచ్చ పురుగు

ఇవి మొక్కల లేత భాగాన్ని తినడంతో ఎదుగుదల ఆగిపోతుంది. నివారణకు లీటరు నీటికి క్లోరిఫైరిఫాస్ 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి. పంట పూతదశలో నీటిఎద్దడికి గురి కాకుండా చూడాలి. కలుపును సకాలంలో నివారిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం



పంటలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సస్యరక్షణలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదిస్తే రైతుల పొలం వద్దకు వచ్చి పంటలను పరిశీలించి పలు సూచనలు చేస్తారు. ఇప్పటి వరకు సంగారెడ్డి జిల్లాలో 13,500 ఎకరాల్లో రైతులు శనగ పంట సాగు చేస్తున్నారు. బావులు, మోటర్ల దగ్గర నీరు పారకంతో మరో వెయ్యి ఎకరాలలో పంట సాగు చేసే అవకాశం ఉంది.

– నర్సింగ్‌రావు, సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి)

దుర్గమ్మ ఆలయంలో పల్లకీసేవ



పాపన్నపేట (మెదక్): ఏడుపాయల వన దుర్గా భవానీ మాతకు శుక్రవారం రాత్రి పల్లకి సేవ నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకొని ఆలయ చైర్మన్ సాతెల్లి బాలాగౌడ్, ఈఓ సారా శ్రీనివాస్, ధర్మకర్తల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మోహన్ రావు, పెంటయ్య, వెంకటేశం, మనెమ్మ, మనోహర్ , శ్రీనివాసరావు, యాదగౌడ్, నాగభూషణం, సాయిలు, సిద్ధిరాములు, బాగారెడ్డి, చక్రపాణి, ఆలయ సిబ్బంది సాయిబాబా, రవి కుమార్, బ్రహ్మచారి, నరేశ్‌గౌడ్, ప్రభాకర్ రెడ్డి , దీపక్ రెడ్డి, పూజారులు రావి కోటి శంకర్ శర్మ, పార్థీవ శర్మ, మురళీ మోహన చార్యులు, రామ్ శర్మ, రాజశేఖర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఆలె భాస్కర్

బీజేపీ రాష్ట్ర బీసీ మోర్చా అధ్యక్షుడు ఆలె భాస్కర్ శుక్రవారం ఏడుపాయల వనదుర్గా భవానీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, పూజారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, నాయకులు తపస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు ఆరోగ్య బీమా కల్పించాలి



యాదమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గడీల కుమార్‌గౌడ్ తదితరులు

దుబ్బాక: ఎంపీటీసీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా, హెల్త్ కార్డులు అందజేయాలని ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. రాయపోల్‌కు చెందిన ఎంపీటీసీ బ్యాగరీ యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకుని వారు శుక్రవారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మదాసు శ్రీనివాస్ కూడా యాదమ్మ కుటుంబాన్ని పరామర్శించారు.
దుబ్బాక: రాయపోల్‌కు చెందిన ఎంపీటీసీ యాదమ్మ కుటుంబానికి అండగా ఉంటామని మెదక్ ఎంపీ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఇటీవల ఎంపీటీసీ యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని పరామర్శించి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తక్షణ సహాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌనిక రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వదిలి.. పొలాల్లోకి



వ్యవసాయ పొలంలో నాట్లు వేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

రామచంద్రాపురం(పటాన్ చెరు): నిత్యం కంప్యూటర్ ముందు బిజీగా ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రైతు కష్టాలు తెలుసుకునేందుకు ముందుకొచ్చారు. కోవిడ్ సమయంలో అందరూ ఇళ్లకే పరిమితమైతే ఒక్క రైతు మాత్రమే వ్యవసాయం చేసి నలుగురికి అన్నం పెట్టాడు. పదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఒక బృందంగా ఏర్పడి శుక్రవారం సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌ను సందర్శించారు. అదే సమయంలో తెల్లాపూర్‌కు చెందిన రైతు ఆంజనేయులు పొలంలో వరినాట్లు జరుగుతున్నాయి. దీంతో ఐటీ ఉద్యోగులు స్వయంగా పొలంలోకి దిగారు. ఎలా వేయాలో తెలుసుకొని మరీ నాట్లు వేశారు. ఈ సందర్భంగా పలువురు ఐటీ ఉద్యోగులు మాట్లాడుతూ రైతులు పడుతున్న కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. కోవిడ్ సమయంలో వ్యవసాయం చేయడంతో పాటు కూరగాయలు పండించడం వల్లనే అందరం ఆరోగ్యంగా ఉండగలిగామన్నారు.

వరినాట్లు వేయడం ఆనందంగా ఉంది



రైతు కష్టాలు తెలుసుకోవాలని తాము స్వయంగా వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాం. నా ఆలోచన తోటి మిత్రులకు తెలపడంతో వారు కూడా ఎంతో ఉత్సాహంగా ముందుకొచ్చారు. తాము స్వయంగా పొలాల్లోకి వెళ్లి వరినాట్లు వేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరు రైతు కష్టాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సుచిత్ర, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

రైతు కష్టాలు అందరూ తెలుసుకోవాలి



వ్యవసాయం చేసేందుకు రైతులు ఎంత కష్టపడతారో అందరూ తెలుసుకోవాల్సిందే. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వ్యవసాయ పనులు చేయడం అందరికీ ఆదర్శంగా నిలుస్తారు.

–మల్లెపల్లి బుచ్చిరెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్